


పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ రాష్ట్ర కమిషన్ సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును, రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం విదార్థులతో కలిసి ఆయన భోజనం చేసి ఆహార పదార్థాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతోనే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి అధికారి జె.సురేష్‌బాబు, సిడిపిఒ యు.స్వర్ణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.చిట్టిబాబు, మహిళా పోలీసు సిహెచ్.కనకదుర్గ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్రాన్సిస్

నిరంతర పోరాటాలతోనే

దళిత సమస్యలు పరిష్కారం

కెవిపిఎస్ జిల్లా ఐదో మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళిత సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం కెవిపిఎస్ జిల్లా ఐదో మహాసభ స్థానిక ప్రియదర్శిని కళాశాల ఆవరణలో జరిగింది. ఈ మహాసభకు కెవిపిఎస్ నేత వంగవ సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది బాపూజీ మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యంతో పనిచేస్తేనే దళితుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా దళితులు తీవ్ర వివక్షకు గురికావడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఎత్తివేతకు కుట్రలో భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దళితులకు లబ్ధి చేకూర్చే 27 పథకాలను రద్దు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలపై దళితులంతా ఐక్యంగా పోరాడాల్సింది పోయి రిజర్వేషన్ల వాటాలపై కుమ్ములాడుకోవడం శోచనీయమన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కెవిపిఎస్ గడచిన మూడేళ్ల కాలంలో దళిత సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమాల నివేదికన సభలో ప్రవేశపెట్టారు. జిల్లాలో దళితుల భూములకు రక్షణ కల్పించాలని కులవివక్ష నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో అన్ని దళిత సంఘాలను ఐక్యం చేసి జిల్లావ్యాప్తంగా దళిత సమస్యలపై ఉమ్మడి పోరాటాల నిర్వహించనున్నామన్నారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు అర్.లింగరాజు, మర్రి వెంకటేశ్వరరావు, న్యాయవాది జువాల బాపూజీ, బొబ్బర ఎలీషా, ఆడమల్లి సోమరాజు, ముప్పిడి మరియమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

ఇ-క్రాప్‌లో నమోదైనా కొనరేం..!

ఒక రైతు నుంచి 12.50 ఎకరాల్లో ధాన్యమే సేకరణ

అడ్డగోలు నిబంధనలతో రైతుల అవస్థలు

మిగిలిన పంట ఏం చేయాలంటూ రైతుల ఆగ్రహం

ఇ-క్రాప్‌లో నమోదైనా కొనుగోలు చేయకపోవడంపై తీవ్ర ఆవేదన

ఉంగుటూరు మండలంలో సమస్య తీవ్రం

ఇబ్బందికరంగా ఎకరాకు 65 సంచుల నిబంధన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'సాగు చేసిన ప్రతి పంటా ఇ-క్రాప్‌లో నమోదు కావాలి. నమోదైతేనే రైతు నుంచి పంటను కొనుగోలు చేస్తాం. లేకుంటే పంట కొనుగోలు అసాధ్యం' అని ప్రభుత్వం, అధికారులు ఇప్పటి వరకూ ఊదరగొట్టారు. కానీ నేడు ఇ-క్రాప్‌లో పంట నమోదు చేసినా 12.50 ఎకరాల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని, మిగిలిన పంటను కొనుగోలు చేయడం కుదరదంటూ అధికారులు చెబుతున్న నిబంధన రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇదేమని అడిగినా సమాధానం చెప్పేవారు లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన నూతన విధానంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. ఇప్పటి వరకూ దాదాపు 70 శాతం వరకూ మాసూలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ స్థాయిలో ధాన్యం కొనుగోలు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అన్నదాతను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. తాజాగా అధికారులు చెబుతున్న కొత్త నిబంధనతో రైతులు తలలుపట్టుకుంటున్నారు. నూటికి నూరుశాతం ఇ-క్రాప్ పూర్తిచేశామని, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరుగుతుందని నిన్నటి వరకూ అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఇ-క్రాప్ పంటలకు సంబంధించిన ధాన్యం కూడా కొనుగోలు చేయలేమంటూ అధికారులు చేతులెత్తేస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి ఎకరాకు సంబంధించి ఇ-క్రాప్ పూర్తిచేశామన్న అధికారులు ఇప్పుడేమో మరోలా మాట్లాడుతున్నారు. జిల్లాలో చాలా మంది రైతులకు 15 ఎకరాలు, 20 ఎకరాలు, ఆపైన భూములున్న రైతులున్నారు. ఈ భూములను అధికారులు ఇ-క్రాప్‌లో నమోదుచేశారు. రైతులు మాసూలు పూర్తిచేసి ధాన్యం తీసుకు వెళితే 12.50 ఎకరాల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని రైతుభరోసా కేంద్రంలో చెబుతున్నారు. మరి మిగిలిన ధాన్యం పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఈ నిబంధన గురించి అప్పుడే చెబితే ఇంట్లో కుటుంబ సభ్యుల పేరుపై కొంత పొలం ఇ-క్రాప్ చేయించుకునేవారమని రైతులు లబోదిబోమంటున్నారు. సరికొత్త నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి తగదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నిబంధనతో రెండుజిల్లాల్లోనూ అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు మండలంలోని నాచుగుంట, కాగుపాడు, ఉంగుటూరుతో పాటు పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. రైతుభరోసా కేంద్రాల్లో సరైన సమాధానం చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

తలనొప్పిగా 65 సంచుల నిబంధన

ధాన్యం కొనుగోలులో తెచ్చిన కొత్తనిబంధనలతో రైతులు తీవ్రంగా నలిగిపోతున్నారు. ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చినా సమస్యగా మారడంతో అన్నదాతకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఎకరాకు 40 కిలోల బరువుగల 65 సంచులను మాత్రమే రైతుభరోసా కేంద్రాల్లో ఇస్తున్నారు. అంటే 75 కిలోల విలువ చేసే 34 బస్తాలకు మాత్రమే సంచులు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఎకరాకు 38 బస్తాలు, 40 బస్తాల దిగుబడి వస్తుంది. దీంతో రైతులు ఆనందపడాలో బాధపడాలో తెలియడం లేదు. 65 సంచుల ధాన్యం మాత్రమే రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు. అంతకు మించి ధాన్యం దిగుబడి వచ్చినా కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆ ధాన్యం ఏ విధంగా విక్రయించాలో తెలీక రైతులు తలలుపట్టుకుంటున్నారు. 65 సంచుల విధానంపై రైతులు ఆదినుంచి మొరపెట్టుకుంటున్నప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఉన్నతాధికారులు సైతం దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జ్యూట్, క్లాత్ ఉత్పత్తుల యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్




మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్లాస్టిక్, ఫ్లెక్సీ బ్యానర్లపై నిషేదం నేపథ్యంలో క్లాత్ బ్యానర్లు, నార, క్లాత్ సంచుల తయారీ క్లస్టర్ ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధం నేపథ్యంలో క్లాత్ బ్యానర్ల క్లస్టర్ ఏర్పాటుకు ప్రింటింగ్ యూనిట్లను ప్రోత్సహించడంపై ఏలూరు నగరపాలక కమిషనర్, డిఆర్‌డిఎ పీడీ, మెప్మా పీడీలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్, క్లాత్ తదితర సంచులను ఉత్పత్తి చేసే యూనిట్ల స్థాపనపై దృష్టి సారించాలన్నారు. సాంప్రదాయ పరిశ్రమల పునరుద్ధరణ కింద అమలు చేస్తున్న పథకం (ఎస్ఎఫ్‌యుఆర్‌టిఐ) స్ఫూర్తి కింద ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. ఈ పథకం కింద ఉన్న రాయితీలను వారికి వివరించాలన్నారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద కన్సల్టెంట్ల ద్వారా క్లస్టర్ల కోసం సిద్ధం చేసిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను ఎస్ఐడిబిఐకి, బ్యాంకులకు పంపే ముందు జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ ముందు పెట్టి కమిటీ ఆమోదం అనంతరం సిడ్బికి(ఎస్ఐడిబిఐ)కి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులను ఆదేశించారు.

జిల్లాలో గృహనిర్మాణం కింద సుమారు లక్ష ఇళ్లు నిర్మించబడుతున్న నేపథ్యంలో వాటికి అవసరమైన ఇటుకలను సిద్ధం చేసేందుకు జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఫ్లైయాష్ బ్రిక్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు హౌసింగ్ పీడీతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎంఇజిపి పథకం కింద స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు రుణాల మంజూరు నిమిత్తం అందిన దరఖాస్తుల్లో ఇంతవరకు 61 యూనిట్లు రూ.304 లక్షలతో ఏర్పాటయ్యాయన్నారు. సింగిల్ విండో కింద పరిశ్రమల ఏర్పాటుకు 164 దరఖాస్తులు రాగా వాటిలో 149 దరఖాస్తులు ఆమోదం పొందాయన్నారు. మరో 12 పరిశీలనలో ఉండగా, మూడు తిరస్కరించబడ్డాయన్నారు. జిల్లాలో చిన్న తరహా, సూక్ష్మ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, విద్యుత్ సబ్సిడీ తదితర ప్రోత్సాహకాలకు అందిన దరఖాస్తులను పరిశీలించి ఆయా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ నిబంధన అనుసరించి రాయితీలను మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది. ఎంఎస్ఇ సిడిపి కార్యక్రమంలో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి జెసి సమక్షంలో రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షులు ఇతర సభ్యులతో సమావేశం నిర్వహించాలని పరిశ్రమల కేంద్రం జిఎంను కలెక్టర్‌ను ఆదేశించారు. వెమ్ టెక్నాలజీ నుండి పున:ప్రారంభించబడే భూమిలో పారిశ్రామిక పార్కుస్థాపనకు సంబంధించి ప్రతిపాదనలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎపిఎఫ్ సిసిఐ ప్రతినిధి వంకాయల రామకృష్ణారావు, నగరపాలక సంస్థ కమిషనర్ షేక్ షాహిద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు, అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, ఎపిఐపిడిసిఎల్ ఎస్ఇ జి.శ్యాంబాబు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ కృష్ణప్రసాద్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ రాంబాబు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర మహాసభ పాటల సీడీ ఆవిష్కరణ




పాటల సీడి ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కూలి పెంచాలి, భూమి పంచాలి నినాదంతో జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల గీతాల సిడిని ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ వజ్రకిరణ్ శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆవిష్కరించారు. కూలీల స్థితిగతులు తెలిపే ఐదు పాటలు కలిగిన ఈ సీడీలో ప్రముఖ ప్రజా కవులు దశరథ, కంకణాల ఆంజనేయులు, వేంపాటి బ్రహ్మాయ్య, సాంబరాజు యాదగిరి, స్ఫూర్తి, శ్రీశ్రీలు రచించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకుల బృందం ఐవి అనిల్, పి.మంగరాజు, పెద్దిరాజు, జగన్ పద్మ, శాంతి, అనూష గీతాలను ఆలపించారు. ఈ సిడి ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మహాసభల విజయవంతం కోరుతూ జరుగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ ఏడో తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాగ్దేవి కారుడు తెలంగాణ ఎంఎల్‌సి ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండల రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తామా ముత్యాలమ్మ, తుమ్మల సత్యనారాయణ, ఎ.రాణి, ఎ.ఫ్రాన్సిస్, పి.సూర్యారావు పాల్గొన్నారు.

డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సంఘ నాయకులు, కార్యకర్తల కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతుంది. శుక్రవారం పట్టణంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ విరివిగా విరాళాల సేకరణ కార్యక్రమానికి వి.గోపి అధ్యక్షత వహించగా జి.సూర్యకిరణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.బుచ్చిరాజు, యు.చిన్నబాబు, ఎం.గంగరాజు, కె.మారయ్య పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గుండుగొలను జగనన్న భారీ లే అవుట్ వద్ద 800 గృహ నిర్మాణాలు చేపట్టిన కాలనీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాల ప్రగతిని స్థానిక శాసనసభ్యులు పుప్పాల వాసు బాబు, గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజనీర్ సతీష్ కలెక్టర్‌కు వివరించారు. ఇదే క్రమంలో కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అనుభవాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గుండుగొలను లే అవుట్‌లో 500 గృహాల నిర్మాణాలను వచ్చేనెల 21వ తేదీ నాటికి పూర్తిచేసి గృహప్రవేశాలు జరిగితే ఆ కాలనీకి మూడు భారీ బీటీ రోడ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో నిర్మాణాలకు నీరు అందించే బోర్లకు మరమ్మతులు చేయాలని, అవసరం మేరకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత వివిధ గ్రామాలకు గృహనిర్మాణ సంస్థ ద్వారా వస్తువులు అందజేసేందుకు గుండుగొలను కేంద్రంగా ఏర్పాటు చేసిన గోదామును పరిశీలించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న కాలనీ ఒక మినీ గ్రామంగా తయారు కానున్న నేపథ్యంలో అవసరం మేరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కృషి చేసిన శాసనసభ్యులు వాసుబాబు, గ్రామ ఉపసర్పంచి సూర్యనారాయణరాజును కలెక్టర్ అభినందించారు. అంతకుముందు కలెక్టర్ గోదావరి కాలువపై గుండుగొలను వద్ద నిర్మించిన బెయిలీ వంతెనను పరిశీలించారు.

బెయిలీ వంతెన ప్రారంభం



వంతెనను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తనకు అండగా నిలవాలని, ఈ నేపథ్యంలో విమర్శలను స్వీకరిస్తానని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద రూ.46.70 లక్షల వ్యయంతో నిర్మించిన బెయిలీ వంతెనను ఆయన జిల్లా కలెక్టర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గ్రామ ఉపసర్పంచి ముందుండి సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ బెయిలీ వంతెన ప్రారంభోత్సవం చేసిన సమయంలోనే గతంలో శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి రూ.3.35 కోట్లు మంజూరు కావటం అభినందనీయమన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రిగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయిన వంతెన మీదుగా గరిష్ఠంగా పది టన్నుల వరకు సామర్థ్యం ఉన్న వాహనాలు మాత్రమే వెళ్లాల్సి ఉందన్నారు. వంతెన మీదుగా రాకపోకలు క్రమబద్ధీకరించినందుకు ఆర్అండ్‌బి శాఖ సహకారంతో రెండు నెలలపాటు కాపలా ఏర్పాట్లు చేయనున్నామన్నారు. ఈ మేరకు నియమితులైన సిబ్బంది ప్రయాణికులకు సహకరించడం ఎక్కువ బరువు గల వాహనాలు వెళ్లకుండా అడ్డగిస్తారని తెలిపారు. నిర్మాణం సమయంలో గ్రామస్తులు అందించిన సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. ఆగడాల లంక వద్ద గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో తాగునీటి రిజర్వాయర్ నిర్మించేందుకు కలెక్టర్ రూ.20 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆక్వారంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో రవాణా వ్యవస్థకు నూతనంగా పరిచయమైన జర్మన్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణం చేపట్టే కార్యక్రమాన్ని భీమడోలు మండలంలో ప్రారంభించామన్నారు. రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ అప్పారావు మాట్లాడుతూ 30 మీటర్ల పొడవు ఆరు మీటర్ల వెడల్పు 71 టన్నుల బరువు గల బెయిలీ వంతెన జీవితకాలం రెండు సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. ఈలోగా నూతన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు జాతీయ రహదారుల శాఖకు తమ శాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

30న జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఫసలి 1432 రబీ పంటకు సంబంధించి జిల్లా ఇంఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఈ నెల 30న జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి సాగునీటి పారుదల సలహామండలి సభ్యులకుఈనెల 22న లేఖ పంపించామని పేర్కొన్నారు. జిల్లాలోని కాలువలు, డ్రెయిన్లలో తూడు, కర్రనాచు, ఇతర తాత్కాలిక పనులు చేపట్టేందుకు గాను విజయవాడ కాడా కమిషనర్ ఇప్పటి వరకూ 48 పనులకుగాను రూ.787.48 లక్షల అనుమతులు మంజూరు చేశారని, అందులో 44 పనులకు గాను గుత్తేదారులు ఖరారయ్యారని తెలిపారు. అందులో 18 పనులు పూర్తికాగా మరో 25 పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. మరో పనిని ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. ఒఅండ్ఎం పనులు కాలువపై మార్చి 2023 వరకూ, డ్రెయిన్లపై డిసెంబరు 2022 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో పంట రబీకి నీటి విడుదల అనంతరం కూడా నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో తగుచర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి పశ్చిమ డెల్టాలో కాలువలు, డ్రెయిన్ల ఆధునీకరణకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫేజ్-2లో ప్రతిపాధనలు రూపొందించామని పేర్కొన్నారు.

జిల్లాలో 220 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తి

రూ.74 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి


ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందేలా గ్రామ సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. మండలంలోని మల్కాపురంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.34 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ డ్రెయిన్లు, ఆర్ఒ ప్లాంట్, కమ్యూనిటీ హాలుకు కలెక్టర్, ఎంఎల్ఎ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నూతన గ్రామ సచివాలయ భవనంలో ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 532 గ్రామ సచివాలయాలకు 220 సచివాలయాల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన భవనాలు జనవరి, ఫిబ్రవరి నెలలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలతో పాటు రైతు భరోసా, డిజిటల్ లైబ్రరీ, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిఇంటికి తాగునీరు పూర్తిస్థాయిలో అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్థానిక ఎంఎల్ఎ గడపగడపకూ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసిందని, వీటిని గ్రామంలో అభివృద్ధి పనులకు ఉపయోగిస్తారని చెప్పారు. కొల్లేరుకు సంబంధించిన సమస్య ముఖ్యమంత్రి పరిధిలో ఉందని ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నాలు జరుగుతన్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో కొల్లేరును టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే రోడ్డును రూ.29 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.200 కోట్లతో నరసాపురంలో రెగ్యులేటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని, త్వరలో దెందులూరు, కైకలూరులో మరో రెగ్యులేటర్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అనంతరం 21 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సర్వస్వతీ కొండలరావు, ఎంపిటిసి బొమ్మవరపు మణిమ్మ, సర్పంచి పత్యాల సునీత, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రూ.3 లక్షల రుణం

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ కామేశ్వరరావు



బ్రాంచిని ప్రారంభిస్తున్న ఛైర్మన్ కామేశ్వరరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ఎలాంటి హామీ, షరతులు లేకుండా రూ.మూడు లక్షల వరకూ పంట రుణాలు ఇవ్వనున్నామని, ఖాతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ఛైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లగూడెంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును రెండేళ్లుగా నిర్వహిస్తూ మరిన్ని నాణ్యమైన సేవలందించేందుకు కొత్త కార్యాలయంలోకి మార్చారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఖాతా దారులు, డ్రాక్వా సంఘాలతో నిర్వహించిన సమావేశానికి బ్రాంచి మేనేజర్ సిహెచ్.బాబూరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఇతర బ్యాంకులకు భిన్నంగా ఇక్కడి పంట రుణాలకు ఎలాంటి హామీ, షరతులు లేకుండా రూ. మూడు లక్షలు ఏడు శాతం వడ్డీకే ఇస్తున్నామని, వీలైనంతమంది సద్వినియోగం చేసుకుని తమ బ్రాంచి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. గొల్లగూడెం బ్రాంచిలో రూ.15 కోట్ల వరకూ రుణాలు ఇచ్చామని, రూ.4.5 కోట్లు డిపాజిట్లు ఉన్నాయని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాలు గొల్లగూడెం, నల్లమాడు, గోపాలపురం, యర్రమిల్లిపాడు, కంసాలిగుంట తదితర గ్రామాల మహిళలు ఇక్కడ ఖాతాలు తెరవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎటిఎం, మైక్రో ఎటిఎం, యాప్, క్యూర్ ఆర్ కోడ్ తదితర ఆధునిక పద్ధతుల్లో బ్యాంకు సేవలు అందిస్తున్నామని వివరించారు. జన్‌ధన్ ఖాతా ఓపెనింగ్ కేవలం నాలుగు నిమిషాల్లోనే అయ్యేలా మైక్రో ఎటిఎం పరికరాన్ని ఈ బ్రాంచిలో ఉంచామన్నారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో రూ.1700 కోట్లు రైతులకు పంట రుణాలు ఇచ్చామన్నారు. వ్యయసాయ భూములు, పొలాలు కొనుగోలు చేసేందుకు కూడా రూ.2 కోట్లకు పైగా రుణాలు ఇచ్చామని ఛైర్మన్ చెప్పారు. ఎడ్యుకేషన్, విదేశాల్లో ఉన్నత చదువుల కోసం రూ.500 మంది విద్యార్థులకు రూ.60 కోట్లు రుణాలు అందించిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవల్లో మేటిగా ఉందన్నారు. డ్వాక్రా సంఘా గుంటూరు, కృష్ణా, ఉభయ జిల్లాల్లో తమ బ్యాంకులో 28 లక్షల మంది ఖాతాదారులన్నారని చెప్పారు. బ్రాంచి ఏలూరు రీజినల్ మేనేజర్ జిఎస్ఎన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గొల్లగూడెంలో రెండేళ్ల క్రితం బ్రాంచి ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకూ రెండు వేలకు పైగా ఖాతాదారుల్లో 160 మంది రైతులకు రూ.2.50 కోట్లు, రూ.పది కోట్లు బంగారు రుణాలు ఇచ్చి నాణ్యమైన సేవలందించిన మేనేజర్ బాబూరావును అభినందించారు. ఈ బ్రాంచిలో లాకర్ సదుపాయాన్ని కల్పించామని, సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచి మేనేజర్ బాబూరావు అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్లానింగ్ హెడ్ ఆంజనేయులు, గొల్లగూడెం బ్రాంచ్ సిబ్బంది సుమంత్, బాలనాగేంద్ర బ్యాంక్ అఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్రావు, దాసరి రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

27న ఏలూరుకు హైకోర్టు న్యాయమూర్తుల రాక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

38 ఏళ్ల ఏలూరు బార్ అసోసియేషన్ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన ఐదుగురు న్యాయమూర్తులు ఏలూరుకు వస్తున్నారని ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులు బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న బార్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, ఏలూరు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కోర్టులోని బి.వి.రంగారెడ్డి ప్రాంగణంలో జరిగే సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

సిఐటియు మహిళా నేత లక్ష్మి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


లక్ష్మి (ఫైల్‌ఫోటో)

మండలంలోని సిర్రివారిగూడెం గ్రామానికి చెందిన సిఐటియు మండల కమిటీ సభ్యులు మిడ్ డే మీల్ వర్కర్ నారం లక్ష్మి (38) అనారోగ్యంతో మృతి చెందారు. లక్ష్మి మృతదేహానికి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి సిఐటియు జెండా కప్పి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వర్కర్‌గా పనిచేస్తూ సిఐటియు యూనియన్‌కి అనేక సేవలందించారన్నారు. ఆమె మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలిగా పనిచేశారన్నారు. ఆమె మృతి యూనియన్‌కి తీరని లోటని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కార్మికులంతా ముందుండాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మల కొండలరావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల నాయకురాలు అనసూర్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ప్రణిత్ ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు


ప్రణిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

స్థానిక నరసింహారావుపేటలో అబ్రహం కాస్పరోవ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరు జోనల్ స్థాయి చెస్ పోటీల్లో సిద్ధార్థ విద్యాలయానికి చెందిన కె.ప్రణీత్ అండర్-11లో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోనేరు సిద్ధార్థ, ప్రిన్సిపల్ కుమార్, పిఎస్ఆర్ కుమార్, ట్రైనర్ యోహాను అభినందించారు.

ఎన్‌టిఆర్ జిల్లా బిసి అధ్యక్షునిగా హరికిషోర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్‌టిఆర్ జిల్లా మాలమహానాడు బిసి అధ్యక్షునిగా నాగళ్ల హరికిషోర్‌ను నియామిస్తూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శేవా నాగజగన్‌బాబూరావు నియామాక పత్రాన్ని అందించారు. శుక్రవారం ముదినేపల్లిలోని జిల్లా మాలమహానాడు, అనుబంధ సంఘాల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హరికిషోర్‌కు నియామాక ప్రతం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాదిగదండోరా అధ్యక్షులు ఏసుపోగు దానియేలు, జిల్లా మాలమహానాడు అధ్యక్షులు జక్కుల విజయకుమార్, నాయకులు ఎ.ప్రతాప్‌కుమార్, దాసరిమణి, మహిత, నాగరాజు, ఎం.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ధర్మకర్తల మండలి ప్రమాణ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత శ్రీజగన్నాథస్వామివారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ ఛైర్మన్‌గా రెండోసారి మద్రివాడ సుబ్బలక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు. సభ్యులుగా కెవివి.జగన్‌మోహన్‌రావు, కె.మాణిక్యం, ఎం.కనకరత్నం, బివిడి.మల్లేశ్వరరావు, బి.కృష్ణవేణి, ఎం.వెంకటేశ్వరరావు, శొంఠి మల్లిబ్బాయి, కోడూరు రాము ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు.

విద్యార్థుల అభ్యున్నతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరం అని అన్నారు. జగనన్న విద్యా దీవెన, అమ్మ ఒడి పథకాల అమల్లో విద్యార్థుల హాజరు విషయంలో ప్రభుత్వం కొత్తగా పరిచయం చేసిన ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి అయిందని చెప్పారు.

తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. కామవరపుకోట మండల కేంద్రంలో ఆసుపత్రి పక్కన ఉన్న శ్రీ లలితా నిలయంలో సోమవారం నుంచి ఉచిత కుట్టు శిక్షణ శిబిర కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అత్యంత నైపుణ్యత కలిగిన ఐదుగురు శిక్షకుల ద్వారా 90 రోజులపాటు ఈ ఉచిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శనం రామదుర్గ కుమార్ ఆచార్యులు (దుర్గ బాబు), సోషల్ వర్కర్ వీరమల్ల మధు, ఒంటెద్దు యేసు వరప్రసాద్, కాకి చంటి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పాలచర్ల రాజవరం శివారులో కోడిపందేల స్థావరంపై ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులను, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత మృతిపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక డాంగే నగర్ 27వ వార్డులో వివాహిత జంగం రమాదేవి (21) అనుమానాస్పద మృతిపై డిఎస్‌పి కెవి.సత్యనారాయణ విచారణ చేపట్టారు. ఈ నెల 24వ తేదీన జంగం రమాదేవి అత్తగారి ఇంటిలో వరకట్న వేధింపులు తాళలేక నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పుట్టింటి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి భర్త లక్ష్మీపతి, అత్తమామలలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. మృతురాలి సోదరుడు రమాదేవి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో డిఎస్‌పి కెవి.సత్యనారాయణ విచారణ చేపట్టారు. సంఘటనా ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ విచారణలో ఆయనతోపాటు స్థానిక సిఐ బాల సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం విద్యుత్ శాఖ కార్యాలయ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చేపల లోడు లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలు కాగా వారిని స్థానికులు అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ కర్ణాటక నుంచి వెస్ట్ బెంగాల్‌కు చేపల లోడుతో వెళ్తుంది. ఎస్ఐ వి.చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వాతావరణంలో మార్పులు.. ఆందోళనలో రైతులు

ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఇక్కట్లు
ధాన్యం కొనుగోలులో సాంకేతిక సమస్యలు

ప్రజాశక్తి - ముదినేపల్లి



వాతావరణంలో వచ్చిన మార్పులతో ఒక్కపక్క ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం చూసే యంత్రాలు మొరాయిస్తుండగా, మరో పక్క చిరుజల్లులు, మబ్బులు రైతులను ఉరుకు పరుగులు పెట్టిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన తేమ శాతం చూసే యంత్రాలు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మొరాయించడంతో రైతులు ఇక్కట్లు పడ్డారు. దీంతో చేసేది లేక వేరే రైతు భరోసా కేంద్రాలకు ఉరుకులు, పరుగులు పెట్టి ధాన్యం తేమ శాతం పరీక్ష చేయించుకోవాల్సి వచ్చినట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ఒకవైపు చిరుజల్లులు మబ్బులు, మరో వైపు యంత్రాలు పని చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని వడాలి, చిరుగుకోట తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో మిషనరీ పని చేయలేదు. ధాన్యం శాంపిల్స్‌ను తేమ శాతం పరీక్ష నిమిత్తం తీసుకువచ్చిన రైతులకు ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో చేసేదిలేక రైతులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముదినేపల్లి, అప్పారావుపేట రైతు భరోసా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో తేలికపాటి వర్షం పడింది. దీంతో రైతులు కోసి, పనలపై ఉన్న పంటను కాపాడుకునేందుకు, రోడ్ల వెంబడి, గట్లపైన ఆరబెట్టిన ధాన్నాన్ని రక్షించుకునేందుకు తీవ్ర ప్రయాస పడ్డారు. గురువారం మండలంలో తీవ్రంగా ఎండ కాయడంతో గండం తప్పిందనుకున్న రైతులకు శుక్రవారం ఉదయన్నే మళ్లీ వర్షం పడడంతో రైతుల గుండెల్లో రైళు పరుగెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ఏమిచేయాల్లో పాలుపోక అయోమాయ పరిస్థితుల్లో ఉన్నారు. కల్లాల్లో ధాన్యం ఆరబెట్టే అవకాశం లేక ట్రాక్టర్లతో బయటకు ధాన్యాన్ని తీసుకువచ్చి గట్లపై, రోడ్ల వెంబడి పరదాలు వేసి ఆరబెట్టుకుంటున్నారు. వర్షం పడడంతో ధాన్యాన్ని పరదాలతో కప్పి రక్షించుకునే పనిలో ఉన్నారు.

ప్రభుత్వం నిబంధనలు సడలించాలి
మరీదు రాధ, రైతు, వడాలి



ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించాలి. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన విధానం వల్ల రైతులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు చెప్పేది ఒకటి, క్షేత్రస్థాయిలో అమలు జరిగేది మరొకటి. ప్రస్తుత వాతావరణం ప్రతికూల పరిస్థితుల్లో నిబంధనలు సడలించి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతును ఆదుకోవాలి. పక్క కృష్ణాజిల్లా కలెక్టర్ రైతుకు ఇబ్బంది లేకుండా తడి, పొడి ధాన్యాన్ని 22 శాతం ఉన్నా రూ.1350కి కొనుగోలు చేస్తుండగా, ఏలూరు జిల్లాలో మాత్రం అమలు కావడంలేదు. తడిపొడి ధాన్యం ఏలూరు జిల్లాలో రూ.1250కి కొనుగోలు చేసినా రైతులకు నష్టం లేదన్నారు. ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శనకు వచ్చిన జెసి అరుణ్‌బాబు తేమ శాతం 20 ఉన్నా అపైగా ఉన్నా కొనుగోలు చేస్తామని చెప్పారు. కానీ ఆ మరుసటి రోజే 17 శాతం వరకే కొనుగోలు చేయాలంటూ మండల వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మండలంలో కచ్చితంగా 17 శాతం లోపు ఉంటేనే కొంటామంటూ అధికారులు చెబుతున్నారన్నారు. కేంద్రాల్లో సంచుల కొరత ఎక్కువగా ఉంది. ధాన్యం కాటా విషయంలో కూడా అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని నిబంధనలు సడలించి తడి, పొడి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

పందుల తరలింపునకు చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పందుల తరలింపునకు చర్యలు తీసుకుంటున్నామని మండలంలోని చేవూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి చెప్పారు. చేవూరులో పందులు స్వైరవిహారం శీర్షికన శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో పందుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తెలిపారు. అయినా పెంపకందారులు లెక్కచేయకుండా పందులను గ్రామంలో విచ్చలవిడిగా వదిలివేస్తున్నట్లు తెలిపారు. పందుల తరలింపునకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెండు రోజుల్లో పందులను పట్టి తరలిస్తామని చెప్పారు.

ఆరుగొలనుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం గ్రామ సర్పంచి పుచ్చకాయల అప్పిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ తమ పంటను ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి అమ్ముకోవచ్చుని ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర అందిస్తుందని చెప్పారు.

వరదరాజపురాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

ప్రజాశక్తి - గణపవరం

వరదరాజపురాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచి కొండేటి నరసింహమూర్తి అన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు ఒకటి, రెండు వార్డు సభ్యులు గుర్రం సుబ్బారావు, రాపాక మార్తమ్మతో కలిసి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామస్తులు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించాలన్నారు. తడి, పొడి చెత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో డ్రెయినేజీలు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్‌డివి.ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - నూజివీడు

శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో రూ.పది వేల విలువైన స్పోర్ట్స్ డెస్క్‌ను పూర్వ విద్యార్థులు శుక్రవారం వితరణ చేశారు. 1993 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శ్రీనివాసరావు, గొల్లపల్లి పంచాయతీ వైస్ ఛైర్మన్ మధు, హైదరాబాదుకు చెందిన అన్నే క్రాంతి ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాధికారాణి, గొల్లపల్లి ప్రముఖులు ఆచార్యులు, విద్యా కమిటీ ఛైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, కొచ్చర్ల రంగారావు, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పద్మ, ఫిజికల్ డైరక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

'చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 30వ తేదీన చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని, మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్ఎలు కోరారు. ధర్మరాజు పెట్రోల్ బాంకు వద్ద నాయకులతో శుక్రవారం సమావేశంలో చంద్రబాబు పర్యటన రూట్‌మ్యాపును మాజీ మంత్రులు, మాజీ ఎంఎల్ఎలు శుక్రవారం పరిశీలించారు. అనంతరం గురుబట్లగూడెం రోడ్డు, ఫైర్ స్టేషన్ వద్ద బహిరంగ రోడ్డు షో ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంటరి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ మంత్రి జవహర్, మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - మండవల్లి

పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కార్యదర్శి తోట శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సచివాలయంలో ఆయన శుక్రవారం వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులను సకాలంలో చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామస్తులు పన్నులు చెల్లించేలా వాలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని బర్రింకలపాడు గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పెద్దిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఖోఖో పోటీ ల్లో పాల్గొన్న కె.చరణ్, ఎం.నాగేంద్రబాబు ఉత్తమ ఆట తీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పలువురు వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర విభాగా ల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వెంకన్నబాబు, వాసు తణుకులో జరిగే జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. ఈ నెల 30వ తేదీన జంగారెడ్డిగూడెంలో నిర్వ హించే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు కె.అరవింద్, కె.సంజయ్, ఎం.కార్తీక్, చరణ్ విద్యార్థులు పాల్గొనాల్సి ఉంద న్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దిరాజు అభినందనందించారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముసునూరు : తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన జెడ్‌పి పాఠశాల విద్యార్థులు పచ్చిగళ్ల ఐశ్వర్య, పిన్నిబోయిన శ్రీవల్లి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రూ.59 లక్షలతో అదనపు తరగతి గదులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రూ.59 లక్షలు నాడు నేడు నిధులతో బాలాజీ నగర్ ఎంపిపి పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా తెలిపారు. స్థానిక 29వ వార్డు బాలాజీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్ ఎంపిపి పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బాలాజీ నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ వందనపు సాయిబాల పద్మ, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, 29 వార్డు కౌన్సిలర్ మానవత మూర్తి, పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలోని నరసన్నపాలెం గ్రామంలో సర్పంచి కర్రెడ్ల ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షుడు తోట జయబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ అర్హులై ఉండి కూడా సంక్షేమ పథకాలను అందని వారి జాబితాను డిసెంబర్ నెలాఖరుకు సిద్ధం చేయాలని, 2023 జనవరిలో ఇప్పుడు సంక్షేమ పథకాలు పొందుతున్న వారితోపాటు దరఖాస్తు చేసుకొని అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, ఎంపిటిసి సభ్యులు మిరియాల విజయ, వైస్ ఎంపిపి తుమ్మలపల్లి గంగరాజు, పార్టీ నాయకులు కర్రెడ్ల ధర్మరాజు, నెరసు కుమార్‌రాజా, పట్టపగలు సతీష్, బూసి అశోక్, వేముల సుబ్బారావు, కర్రెడ్ల గౌతమి, బుసి లక్ష్మి, ఎం.జయలక్ష్మి, తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిత్తపూరు గ్రామపంచాయతీలో ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చిత్తపూరు గ్రామంలోని దళితవాడలో ఎంపిపి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పని చేస్తున్నారన్నారు. రెండో ఉపాధ్యాయుడు 11వ తేదీ నుంచి సెలవు కూడా పెట్టకుండా పాఠశాలకు గైర్హాజరవుతున్నారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సరైన పోషకాహారం అందించడంలేదన్నారు. కేంద్రంలో కేవలం ఇద్దరు పిల్లలే ఉన్నారని, ఒక విద్యార్థి మాత్రమే హాజరవుతున్నాడని చెప్పారు. ఈ విషయాలను సంబంధిత విద్యాశాఖ అధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్ తెలిపారు. ఈ తనిఖీలో గ్రామ సర్పంచి తిరువీధి రమేష్ ఉన్నారు.


చాట్రాయి.. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపిడిఒ తనిఖీలు

ముసునూరు : మండలంలోని కోర్లగుంట శివారు సింహాద్రిపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ముసునూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచిపూడి సాయిరాము శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణమైన భోజనం అందించాలన్నారు. అంగన్‌వాడీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ సుబ్బరాజు ఉన్నత పాఠశాలను ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలు బోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి టౌన్ అధ్యక్షులు నాగు, ప్రకాష్ పాల్, సురేష్ పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మారుమూల గ్రామాల నిరుపేదలకు సత్వర వైద్యం అందించడమే లక్ష్యమని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో శుక్రవారం వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ సిఎం జగన్ ఎంతో ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణప్రాంత ప్రజలకు వారి సొంతూరులోనే ప్రాథమిక వైద్య చికిత్సలు, వైద్య పరీక్షలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, పార్టీ మండల అధ్యక్షులు మోత్రు ఏసుబాబు, గ్రామ సర్పంచి గంటా రాకేష్, ఎంపిటిసి సభ్యులు ఎం.నాగదుర్గ, స్థలదాత పీత వెంకటేశ్వరమ్మ, పీత గౌతమ్, వైసిపి నేతలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని మూడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని మిగులు ధాన్యాన్ని నిబంధనల మేరకు అనుమతించిన తేమశాతం వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని భీమడోలు తహశీల్దార్ జాన్‌రాజు తెలిపారు. గురువారం ఎపి రైతు సంఘ బృందం గుండుగొలనులో పర్యటించి రైతులతో మాట్లాడిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని 14 రైతు భరోసా కేంద్రాల ద్వారా 606 మంది రైతులకు చెందిన 3577.24 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. గుండుగొలనులో 215 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరగగా 581 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇప్పటివరకు నిబంధనలకు అనుగుణంగా ఉన్న 243.92 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. మిగిలిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నందున తీసుకోలేదని తెలిపారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందించే జగనన్న ఇళ్ల నిర్మాణాల వద్ద లబ్ధిదారులకు సౌకర్యాలు కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పరింపూడి పంచాయతీ పరిధి కొయ్యలగూడెం గ్రామ శివారు మల్లోలు పొలాల వద్ద నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను సిపిఐ మండల నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునేవారికి ప్రభుత్వం మంచినీటి సౌకర్యం, కరెంటు, రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

ప్రజాశక్తి- జంగారెడ్డిగూడెం

సమాజంలో మహిళలపై వివక్షతను, హింసను అరికట్టాలని మహిళా శిశుసంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయి బాల పద్మ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లింగ వివక్షతపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయి బాల పద్మ మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఎదురవుతున్న వివక్షతను అధిగమించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టిఎంసి సిహెచ్.మోహన్, సిఎ రాధ, సిఐ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు రమ పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాధికారిక విభాగం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ వారిపై జరిగే దాడుల్లో, హింసలో ఎటువంటి మార్పులు రావడం లేద న్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు ఎన్‌వివి ఎస్‌బి.సుబ్బారావు జి.వెంకట్రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చినసత్యనారాయణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి తెల్లం వెంకాయమ్మ అధ్యక్షతన లింగ వివక్షత నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో సర్పంచి తెల్లం వెంకాయమ్మ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మహిళలు ఎదుర్కొనే అనేక సమస్యలను ప్రస్తావిస్తూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని చెప్పారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామాల్లోని ప్రజలకు సేవలందించేలా ఖాళీగా ఉన్న వాలంటరీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గన్నవరంలో ఒకటి, లింగాలలో ఒకటి, లోకుముడిలో రెండు, ఉనికిలిలో ఒక వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా జీలుగుమిల్లి పంచాయతీలో శుక్రవారం స్పెషల్ శానిటేషన్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎంపిడిఒ కె.మంగతాయారు తెలిపారు. దీనిలో భాగంగా పంచాయతీ పరిధిలోని సిర్రివారిగూడెం, చంద్రమ్మ కాలనీలో ఉన్న డ్రెయినేజీలను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. పంచాయతీ రోడ్ల పక్కన ఉన్న చెత్త, విధుల్లోని చెత్తను గ్రామస్తులు, పారిశుధ్య కార్మికులు కలిసి స్వచ్ఛందంగా పాల్గొని పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి చిర్రి జగదంబ, కార్యదర్శులు పి.అశోక్, దేవప్రియుడు, లక్ష్మీప్రసన్న, ఉప సర్పంచి రవితేజ పాల్గొన్నారు.

రాజులకాలనీలో విద్యుత్ పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు - నారాయణపురం రాజులకాలనీలో 11 కెవి విద్యుత్ సర్వీస్ ఉన్న స్తంభం విరిగిపోవటంతో మరమ్మతులకు గురైంది. దీంతో ఎమర్జెన్సీ వర్క్‌గా అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరఫరా నిలిపేసి విరిగిన స్తంభం తొలగించి కొత్త స్తంభం దానిపై ట్రాన్స్‌ఫార్మర్ (డిటిఆర్) బిగించి సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఘనంగా సూర్యప్రకాష్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గేదెల పాపాయమ్మ రాధాకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నేత గేదెల సూర్యప్రకాష్ పుట్టినరోజు వేడుకలను స్థానిక పోణంగి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్చి కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన పోణంగి గ్రామంలోని పలువురు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని వికలాంగుల ఆశ్రమంలోని చిన్నారులకు భోజనాలను ఏర్పాటు చేయించారు. పలువురు వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు.